క్లుప్తంగా

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న జిల్లా జడ్జి



జడ్జి చంద్రశేఖరప్రసాద్‌కు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయాన్ని బుధవారం జిల్లా జడ్జి పి.చంద్రశేఖరప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈఓ రజనీకుమారి, అర్చకులు జడ్జికి ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చకులు ఆశీర్వచనం చేశారు.అనంతరం అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు.

స్వయం ఉపాధి పొందండి

ఇల్లెందు: మహిళలు స్వయం ఉపాధి పొంది కుటుంబాలను బలోపేతం చేసుకోవాలని ఎమ్మెల్యే బానోతు హరిప్రియ సూచించారు. బుధవారం ఇల్లెందులో న్యాక్ ద్వారా కుట్టు శిక్షణ పొందిన వారికి కుట్టు మిషన్లు, మెటీరియల్ అందజేశారు. మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా స్త్రీలు ఉపాధి రంగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో న్యాక్, లేబర్ ఆఫీస్‌లకు చెందిన ఏఓ రమేష్, ఏడీ హనీఫ్, సీజీఎస్ నాగమణి పరుచూరి వెంకటేశ్వరరావు, గిన్నారపు రాజేష్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీ కేసును సీబీఐకి అప్పగించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): టీఎస్ సీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేసీఆర్ కుటుంబానికి సంబంధం ఉందన్న విషయం బలపడుతోందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. కేటీఆర్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలని, టీఎస్ సీఎస్సీ చైర్మన్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సాయి, జెట్టి ఆనందరావు, మాళోత్ వీరూనాయక్, వంగా రవిశంకర్, నిరంజన్‌కుమార్ పాల్గొన్నారు.

సిమెంట్ బల్లలు వితరణ

జూలూరుపాడు: మండలంలోని అన్నారుపాడు, గుండ్లరేవు గ్రామాల్లో బానోత్ సక్రి జ్ఞాపకార్థం ఆమె కోడలు, అన్నారుపాడు సర్పంచ్ బానోత్ పద్మ సిమెంట్ బల్లలు వితరణ చేశారు. 20 బల్లలను గుండ్లరేవు, అన్నారుపాడు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో ప్రజలు కూర్చొనేందుకు బుధవారం వీటిని ఏర్పాటు చేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు.

ఎస్పీఎఫ్ డీజీని కలిసిన అడిషనల్ కమాండెంట్



డీజీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న జంగయ్య

పాల్వంచ: కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సీ.జంగయ్య అడిషనల్ కమాండెంట్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా బుధవారం డీజీ ఉమేశ్వర్ షారూఫ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మణుగూరు బీటీపీఎస్ కర్మాగారం నిర్మాణం పూర్తవుతున్న సందర్భంగా కేటీపీఎస్, బీటీపీఎస్‌లకు కలిపి అడిషనల్ కమాండెంట్ అవసరం ఉన్న నేపథ్యంలో కొత్తగా ఈ పోస్టును ఏర్పాటు చేశారు. కాగా కేటీపీఎస్ అసిస్టెంట్ కమాండెంట్‌గా నాగర్జున సాగర్‌లో విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ ఇక్కడికి రానున్నారు.

నర్సరీల ఆకస్మిక సందర్శన

జూలూరుపాడు: మండలంలోని వెంగన్నపాలెం, సాయిరాం తండా, మాచినేనిపేట తండా, పడమట నర్సాపురం, వినోభానగర్ గ్రామాల్లోని నర్సరీలను బుధవారం డీఆర్డీఓ మధుసూదన్ రాజు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీల నిర్వాహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. నర్సరీల్లో ప్రతి మొక్కను సంరక్షించాలి, మొక్కలు చనిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి ఆయన సూచించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ రవి, టీఏలు సుహాసని, ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్లు వీరభద్రం, మూడ్ రమేష్, రవి, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీసీతారాముల కళ్యాణం చూతము రారండి..

- ఆలయాల ఎదుట చలువ పందిళ్లు
- అంగరంగ వైభవంగా వేడుకలకు ఏర్పాట్లు



వేడుకలకు ముస్తాబైన సర్వారంలోని శ్రీ సీతారామ ఆలయం

సుజాతనగర్: భద్రాచలంలో సీతారాముల కల్యాణం తరువాత ఆ స్థాయిలో సర్వారం గ్రామంలోని శ్రీ సీతారామ దేవాలయంలో కల్యాణం నిర్వహిస్తారు. దీని వెనుక ఓ చరిత్ర ఉంది. సీతారామ, లక్ష్మణులు 14 సంవత్సరాల వనవాసం అనంతరం పట్టాభిషేకం నిమిత్తం అయోధ్యకు వెళ్లే క్రమంలో.. ప్రస్తుతం ఇక్కడ ఉన్న శ్రీ సీతారామ ఆలయం ప్రాంతంలో బస చేసినట్లు చరిత్రకారులు చెబుతుంటారు. ఈ క్రమంలో పద్నాలుగేళ్లపాటు వనవాసంలో వారు అనుభవించిన కష్టాలన్ని ఇక్కడ బస చేసిన ప్రదేశంలో మరిచిపోయారని, అందువల్ల ఈ ప్రాంతం సర్వం రామనామంతో నిండిపోవాలని వారు ఆజ్ఞాపించడంతో కాలక్రమేణా ఈ గ్రామం సర్వారంగా మారిందని అంటుంటారు.

గ్రామానికి ఇదే పెద్ద పండుగ...

సీతారామ లక్ష్మణులు ఈ ప్రాంతంలో బస చేశారనే చరిత్ర ఉండటంతో అంతే స్థాయిలో ఏళ్ల తరబడి ఇక్కడ సీతారాముల కల్యాణ క్రతువును అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. రెండు రోజుల పూజా కార్యక్రమాల్లో భాగంగా కల్యాణం, పట్టాభిషేకం కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది వేడుకల్లో భాగంగా నేడు శ్రీసీతారాముల కల్యాణం మహోత్సవం నిర్వహించనున్నారు.

ఇదేరోజు రాత్రి నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం వరకు ఉమ్మడి గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో సీతా రాముల విగ్రహాలను ఊరేగింపు చేసిన తరువాత ఆలయంలో పట్టాభిషేకం నిర్వహిస్తారు. గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిరపడినవారు, ఈ ఊరి అల్లుళ్లు, బంధువులు కుటుంబ సమేతంగా కల్యాణ మహోత్సవానికి హాజరవుతారు.

మండపం నిర్మించాలి..



సీతారామ లక్ష్మణులు ఈ ప్రాంతంలో బస చేసినట్లు గ్రామస్తుల విశ్వాసం. ఆలయంలో ధూపదీప నైవేద్యాలు, శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరుపుకుంటున్నప్పటికీ దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆలయంపై దృష్టి సారించడం లేదు. ఈ శాఖ కలగజేసుకొని ఇక్కడ కల్యాణ మండపం నిర్మించాలి.

– బానోత్ మాన్‌సింగ్, ఆలయ కమిటీ చైర్మన్

వాడవాడనా చలువ పందిళ్లు



ఇల్లెందురూరల్: మామిడిగూడెం రామాలయంలో తాటాకులతో పందిరి



సింగరేణి(కొత్తగూడెం): రుద్రంపూర్‌లో శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయం

ఇల్లెందురూరల్: శ్రీసీతారమచంద్ర స్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు మండలంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. ఆలయ ప్రాంగణాలతోపాటు పలు గ్రామాలలోని కూడళ్లలో చలువ మందిళ్లు వేసి సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు చేశారు.

కొమరారం, వీరాపురం, ఆంజనేయపురం, సుభాష్‌నగర్, మామిడిగూడెం తదితర గ్రామాలలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. రామాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కార్మిక వాడల్లో...

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి రుద్రంపూర్, గౌతంపూర్, ధన్‌బాద్, రాంపురం, రామవరం, 2,3,4 ఇంక్‌లైన్, నాగయ్య గడ్డ, పంజాబ్‌గడ్డ తదితర ప్రాంతాల్లో గురువారం నిర్వహించనున్న శ్రీ సీతారామ కల్యాణానికి ఆలయాలు ముస్తాబయ్యాయి. భక్తులకు సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు. ఎండతీవ్రతకు చలువ పందిళ్ల వేశారు. అదేవిదంగా వారికి మజ్జిగ,పానకం తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేస్తున్నారు.

ముచ్చట గొలుపుతున్న విగ్రహాలు



రోడ్డు మీద అమ్మకానికి ఉత్సవ విగ్రహాలు

ఇల్లెందు: భద్రాద్రి జిల్లా అంటేనే శ్రీరాముడి జిల్లా .. అదే పుణ్యక్షేత్రం వెలిసిన భద్రాచలం. అలాంటి ఈ జిల్లాలో పల్లెపల్లెన ప్రతిఏటా శ్రీరాముడి కల్యాణం ఘనంగా నిర్వహిస్తారు. నూటికి 70 శాతం పట్టణాలు, పల్లెల్లో రామాలయాలు ఉన్నాయి. ఆయా ఆలయాల్లో, ఆలయాలు లేని ఊళ్లల్లో కూడా ఉత్సవమూర్తులను తెచ్చి ఘనంగా పెళ్లి పందిరిలో వివాహం జరుపుతుంటారు. శ్రీరాముడి వివాహానికి తక్కువ ధరలో ఉత్సవ విగ్రహాలు అందుబాటులోకి వచ్చాయి. పట్టణంలోని మెయిన్ రోడ్డులో రాముడు, లక్ష్మణుడు, సీత, హనుమంతుడు విగ్రహాలను అమ్ముతున్నారు. శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు ఈ విగ్రహాలను కొనుగోలు చేసి తరలించుకు వెళుతున్నారు.


కల్యాణానికి ఆలయాలు ముస్తాబు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని రామాలయాల్లో శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవం జరిపించడానికి ఏర్పాట్లు చేశారు. శ్రీభజన మందిరం, రైల్వే స్టేషన్ ఆవరణలోని కోదండరామ స్వామి ఆలయం, పాతకొత్తగూడెంలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయం, బాబు క్యాంపులోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయాల్లో ప్రతి ఏటా స్వామి కల్యాణం వైభవంగా నిర్వహిస్తారు. రైల్వే స్టేషన్ ఆవరణలో కోదండరామస్వామి ఆలయంలో బుధవారం హోమ, ధ్వజారోహణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఆలయంలో కల్యాణం నిర్వహించడం ఈ ఏడాదితో 60వ సారి అని అర్చకులు వివరించారు.

జూలూరుపాడు: గురువారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. శ్రీసీతారాముల కల్యాణానికి ఆయా కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

పాల్వంచరూరల్: ఏజెన్సీ గ్రామాల్లోని రామాలయాల్లో అన్ని ఏర్పాటు చేశారు. బస్వతారకకాలనీలోని రామలయాలం, తోగ్గూడెం, జగన్నాథపురం, పాండురంగాపురం, సూరారం, యానంబైల్, రెడ్డిగూడెం, నాగారం, రంగాపురం గ్రామాల్లో ఆలయాల్లో నవమి జరుపుకునేందుకు టెంట్లు, తాటాకులతో పందిళ్లు వేసి ముస్తాబు చేశారు.





కొత్తగూడెంఅర్బన్: బాబుక్యాంపులో రామాలయం, జూలూరుపాడు ఆలయంలో శ్రీసీతారాములు

యానంబైల్‌లో..

పాల్వంచరూరల్: శ్రీరామనవమి సందర్భంగా యానంబైల్ గ్రామంలోని శ్రీరామాలయాన్ని స్థానికులు ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం స్వామివారిని ఊరేగింపు నిర్వహించి ఎదుర్కోలు ఉత్సవం జరిపారు. అనంతరం ఆలయంలో భక్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు పెద్దఎత్తున పాల్గొని ముత్యాల తలంబ్రాలు కలిపి సిద్ధం చేశారు.



ఆలయంలో ముత్యాల తలంబ్రాలు కలుపుతున్న భక్తులు

పాఠశాలలో నవమి వేడుకలు



వివేకవర్ధిని పాఠశాలలో లక్ష్మణుడు, రాముడు, సీత, ఆంజనేయుడు వేషధారణలో విద్యార్థులు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని వివేకవర్ధని పాఠశాలలో శ్రీ రామ నవమి వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు రాముడు సీత వేషధారణతో ఆకట్టుకున్నారు. హెచ్‌ఎం అమ్మ మహేష్ మాట్లాడుతూ.. విద్యార్థులందరూ రాముడి గొప్ప వ్యక్తిత్వాన్ని అలవరుచుకోవాలన్నారు. శ్రీ రాముడు తల్లిదండ్రులు, గురువులను ఆరాధించేవాడని, తూచ తప్పకుండా ధర్మం పాటించేవాడని చెప్పారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

టేకులపల్లి: పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థులు భవిష్యత్ కెరీర్‌పై శ్రద్ధ పెట్టాలని, పదో తరగతి తరువాత ఏఏ కోర్సుల్లో చేరాలో అవగాహన ఉంటేనే బంగారు భవిష్యత్‌కి పునాదులు పడతాయని బొమ్మనపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ పిండిపోలు బుజ్జి కన్నయ్య అన్నారు. ఈ మేరకు తన తండ్రి, స్వాతంత్ర్య సమర యోధుడు పిండిపోలు రామయ్య సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం బొమ్మనపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పది తరువాత ఏఏ కోర్సులు చదివే అవకాశం ఉందో తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టేకులపల్లి మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో ఈ కరపత్రాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, పీఈటీ వి.నరేష్ కుమార్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటి పరిధిలోని రామవరం 10వ వార్డులో కౌన్సిలర్ మునిగడప పద్మ ఆధ్వర్యంలో ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం, పర్యావరణాన్ని కాపాడండి, తడి–పొడి చెత్తను వేరు చేయండి, వార్డును పరిశుభ్రంగా ఉంచాలని బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేరక్షణ్‌ను పురస్కరించుకొని ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామని, ఇంటింటికి వచ్చే మున్సిపల్ వాహనానికి తడి,పొడి చెత్తను వేర్వేరుగా ఇచ్చి వారికి సహకరించాలని, వార్డును శుభ్రంగా ఉంచాలని కోరారు. దీని ద్వారా అంటువ్యాధులు రాకుండా మనకు మనం కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు, ఆర్పీ కవిత, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

స్తంభం ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

టేకులపల్లి: బొమ్మనపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలో విద్యుత్ స్తంభం విరిగి పోవడంతో తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ సమస్యపై ఈనెల 27న సాక్షి దినపత్రికలో 'అటెన్షన్ ప్లీజ్' పేరుతో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు అనే శీర్షికన ప్రత్యేక వార్త ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ ఏఈ పిండిపోలు బుజ్జి కన్నయ్య బుధవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి సిబ్బంది చేత స్తంభం ఏర్పాటు చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

దేశానికి బీజేపీతో ప్రమాదకరం..

సింగరేణి(కొత్తగూడెం): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశానికి ప్రమాదకరంగా మారిందని, దీన్ని నియంత్రించి గద్దె దించేందుకు ప్రతిపక్షాలు ఏకమై దేశాన్ని రక్షించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థతోపాటు ఫెడరలిజాన్ని పూర్తిగా నాశనం చేయడానికి పూనుకుందన్నారు. బీజేపీ ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు ప్రతిపక్షాలు, ప్రజలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. అయోధ్య, రాంప్రసాద్, బందెల నర్సయ్య, గుత్తుల సత్యనారాయణ, ముత్యాల విశ్వనాథం, పుల్లారెడ్డి, కల్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సొసైటీ లక్ష్యం

పాల్వంచ: రైతుల సంక్షేమమే సొసైటీ లక్ష్యం అని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వరి ధాన్యం కొనుగోలుపై గత ఐదు సీజన్ల నుంచి కమీషన్ పెండింగ్‌లో ఉందని, అధికారులు వెంటనే వాటిని విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన రుణమాఫీ వెంటనే విడుదల చేయాలన్నారు. మధ్యకాలిక రుణాలైన పాడి గేదెలు, ద్విచక్ర వాహన రుణాలకు మాఫీ ఉండదన్నారు. కాంపెల్లి కనకేశ్, బుడగం రామమోహన్‌రావు, కనగాల నారాయణరావు, జనార్దన్‌రెడ్డి, చౌగాని పాపారావు, సీతారాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

వాలీబాల్, కబడ్డీ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, ఆవునూరి మధు

టేకులపల్లి: బోడు, కొమరారం మండలాల ఏర్పాటు డిమాండ్ న్యాయమైందని, ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య ప్రభుత్వాన్ని కోరారు. బోడు, కొమరారంలను నూతన మండలాలుగా ఏర్పాటు చేయాలని, ఇల్లెందును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కొన్ని నెలలుగా నిర్వహిస్తున్న ఉద్యమంలో భాగంగా బుధవారం బోడు గ్రామంలో పురుషులకు ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ.. మండలాల ఏర్పాటుపై ప్రభుత్వం ఆలోచించి సానుకూలంగా స్పందించాలని కోరారు. క్రీడా పోటీల నిర్వాహకులు, క్రీడాకారులను అభినందించారు. మండలాలు, రెవెన్యూ డివిజన్ సాధన కోసం చేస్తున్న ఉద్యమానికి తనవంతు పూర్తి సహకారం ఉంటుందని పేర్కొన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం మండలాలు, రెవెన్యూ డివిజన్ ఇవ్వకుండా ప్రజాభివృద్ధికి ఆటంకం కలిగిస్తోందని దీనిని నిరసిస్తూనే క్రీడా పోటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొత్తం 60 జట్లు పోటీలో పాల్గొన్నాయి. కార్యక్రమంలో ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, తుపాకుల నాగేశ్వర్‌రావు, కల్తి వెంకటేశ్వర్లు, ఎట్టి నరసింహారావు, చింత నరసింహారావు, జోగ కాంతారావు, రామచంద్ర, పూనెం కోటయ్య, గొగ్గెల రాజు తదితరులు పాల్గొన్నారు.

నా జీవితం ప్రజా సేవకే అంకితం..



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాల అమలులో ముందుందని, ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రజా సేవకోసం నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమళ్ల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. తొలుత బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కొత్తగూడెం నుంచి గట్టుమళ్ల గ్రామం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమ్మేళనంలో ఎమ్మెల్యే వనమా మాట్లాడుతూ.. పదవులు ఉన్నా లేక పోయినా ప్రజల కోసం పని చేస్తానని, నాజీవితం ప్రజా సేవకు అంకితం అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా సోనా, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, మండె హనుమంతరావు, కొట్టి వెంకటేశ్వర్లు, కాసుల వెంకట్, అన్వర్‌పాషా, వజ్జారాజు, దామోదర్, కొల్లు పద్మ, జక్కుల సుందర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం..



ఇల్లెందు: ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ



కొత్తగూడెంఅర్బన్: ర్యాలీలో పాల్గొన్న స్థానికులు

ఇల్లెందు: చెత్తను వేరు చేయటం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని ప్రజలంతా పర్యావరణ పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేయాలని ఎమ్మెల్యే హరిప్రియ కోరారు. బుధవారం పట్టణంలోని జగదాంబా సెంటర్‌లో జరిగిన స్వచ్ఛత మహోత్సవ సభ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం జరిగిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ అంకుషావలీ, ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, డీఈ రామకృష్ణ, ఏఈ శంకర్, ఎస్‌ఐ రాధాకృష్ణ పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న స్వచ్ఛత మార్షల్ మార్చ్‌లో భాగంగా కొత్తగూడెం పట్టణంలో బుధవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించారు. 'స్వచ్ఛోత్సవ్ – 2023, ఉమెన్ లీడ్ శానిటేషన్'కార్యక్రమాలు వేర్వేరుగా జరిగాయి. మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, పట్టణ పరిధిలోని మహిళలతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించి, రైల్వే స్టేషన్ నుంచి పోస్టాఫీస్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రఘు వార్డులలో ర్యాలీని ప్రారంభించి మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రుక్మాంగధర్‌బండారి, మాదా సత్యవతి, గుమ్మడెల్లి కళ్యాణి, బాలిశెట్టి సత్యభామ, మాచర్ల రాజకుమారి, భూక్యా శ్రీనివాస్, మెప్మా డీఎంసీ రాజేష్, టీఎంసీలు నాగయ్య, వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అశోక్, వీరభద్రచారి స్థానికులు పాల్గొన్నారు.